RNI.No. TELTEL/2010/32434

TELANGANA RISING 2047

# అన్వేషణనేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 67 | మంగళవారం 07 జులై 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00



## ధైర్యానికి శాశ్వత నిదర్శనం.. శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ప్రధాని మోదీ నివాళి..

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు.

2



## ఫిఫా ప్రపంచ కప్: ట్రంప్ జోక్యం.. యూఎస్ ప్లేయర్‌పై నిషేధం ఎత్తివేత!

ఫిఫా ప్రపంచ కప్ 2026లో రౌండ్ ఆఫ్ 32లో జరిగిన మ్యాచ్‌లో అమెరికా ఫుట్‌బాలర్ పోలారిన్ బలోగన్‌పై రిఫరీ రెడ్ కార్డ్ చూపించారు. దీంతో బెల్జియంతో జరిగే మ్యాచ్‌కు అతడిపై నిషేధం పడింది. అయితే బలోగన్‌పై ఉన్న ఒక మ్యాచ్ నిషేధాన్ని ఫిఫా ఎత్తివేయడం ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేరుగా ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినోతో ఫోన్‌లో మాట్లాడిన తర్వాతే ఈ నిర్ణయం వెలువడిందన్న వార్తలు ప్రపంచ ఫుట్‌బాల్ వర్గాల్లో సంచలనం సృష్టించాయి.

2



2

## ఆ ముగ్గురు గ్రేట్ సైంటిస్టులకు ఘన నివాళి.. అంతరిక్షంలోకి సూక్ష్మ విగ్రహాలు..

భారతదేశానికి చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' చరిత్రాత్మక అంతరిక్ష ప్రయోగానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. స్కైరూట్ సంస్థ ఈ నెలలో 'మిషన్ ఆగమన్' పేరిట 'విక్రమ్-X' రాకెట్‌ను శ్రీహరికోట నుంచి అంతరిక్షంలోకి పంపనుంది.

# నూతన "విప్ ఛాంబర్"







ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలోని తన నూతన "విప్ ఛాంబర్" ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గౌరవ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గారు, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్ గారు, బల్మూరి వెంకట్ గారు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ గారు తదితరులు హాజరై శ్రీ వేముల వీరేశం గారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరింత సమర్థవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.











## కాళేశ్వరం పేరుతో కేటీఆర్ డ్రామాలు చేస్తున్నారు..



2

మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం పేరుతో ఆయన డ్రామాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈరోజు (సోమవారం) మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు.



## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు.. అల్లుఅర్జున్ వర్చువల్ హాజరుకు కోర్టు అనుమతి

వార్త 2లో

## రాజకీయంగా ఎదిగేందుకు రాముని పేరు వాడుకున్నారు..



2

శ్రీరామునికి రామ జన్మభూమిలో రామ మందిరం నిర్మాణానికి ప్రజలు ఎవరి స్థితికి తగ్గట్టు వారు విరాళాలు ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. విరాళాల్లో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. బీజేపీ నాయకులు.. రాముని పేరుతో, అక్షింతలపై విరాళాలు అడుక్కున్నారని విమర్శించారు.

## గంజాయి రవాణా అరికట్టేందుకు కార్యాచరణ: డీజీపీ సీవీ ఆనంద్

రాష్ట్రంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.



2

## కన్నెపల్లి వద్ద లక్ష క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి: కేటీఆర్

2



# పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కీలక చర్యలు

**దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి**

**మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలి**

**టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ అభివృద్ధి**

**గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో భాగ్యనగరంలో ఎకో పార్కులు..**

**ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలి**

**పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు..**



హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

తెలంగాణ పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కీలక చర్యలు చేపట్టారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం క్యాంపస్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై వారికి కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని పర్యాటక ప్రాంతాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు ముఖ్యమంత్రి. గొల్కొండ సమీపంలోని తారామతి బారాదరిని టూరిజం ప్రాంతంగా మరింత అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లోని వీరభద్రస్వామి దేవాలయాన్ని డెవలప్ చేసి యాదాద్రి తరహాలో ఆలయానికి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో భాగ్యనగరంలో ఎకో పార్కులను తీర్చిదిద్దాలని ఆజ్ఞాపించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్నారు. అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఏర్పాట్లు చేయాలని, ఆ ప్రాజెక్టుల కోసం ప్రత్యేక అధికారిని నియమించి పనులను ముమ్మరం చేయాలన్నారు. పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవకాశం ఉంటే ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలన్నారు ముఖ్యమంత్రి. డిసెంబరులో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పైనా కసరత్తు ప్రారంభించాలని, సమ్మిట్ కోసం శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కాగా, ఈ సమీక్షా సమావేశానికి సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి హాజరయ్యారు.

## ధైర్యానికి శాశ్వత నిదర్శనం.. శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ప్రధాని మోదీ నివాళి..

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు. ప్రధాని మోదీ తన బ్లాగ్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను ప్రస్తావించారు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, దేశసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని చెప్పారు. వలస పాలన, విభజన రాజకీయాలు, సామాజిక సవాళ్ల వంటి అంశాలపై ఆయన రాజీపడకుండా పోరాడారని గుర్తు చేశారు. దేశ సమైక్యతే శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజాజీవితానికి మూల సూత్రమని ప్రధాని అన్నారు. దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్ భారతదేశంలోనే కొనసాగడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అనంతరం జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనానికి కృషి చేస్తూ నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏలను 2019లో తమ ప్రభుత్వం రద్దు చేసిందని, అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ప్రధాని మోదీ అభివర్ణించారు. అలాగే కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత పిన్న వయసులో వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామా ప్రసాద్.. పరిశోధన, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి పరిశ్రమల మంత్రి అయిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, సింద్రి ఎరువుల కర్మాగారం వంటి కీలక ప్రాజెక్టులకు పునాది వేశారని ప్రధాని గుర్తు చేశారు.

## ఫిఫా ప్రపంచ కప్: ట్రంప్ జోక్యం.. యూఎస్ ప్లేయర్‌పై నిషేధం ఎత్తివేత!

ఇంటర్నెట్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

ఫిఫా ప్రపంచ కప్ 2026లో రౌండ్ ఆఫ్ 32లో జరిగిన మ్యాచ్‌లో అమెరికా ఫుట్‌బాలర్ ఫోలారిన్ బలోగన్‌పై రిఫరీ రెడ్ కార్డ్ చూపించారు. దీంతో బెల్జియంతో జరిగే మ్యాచ్‌కు అతడిపై నిషేధం పడింది. అయితే బలోగన్‌పై ఉన్న ఒక మ్యాచ్ నిషేధాన్ని ఫిఫా ఎత్తివేయడం ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేరుగా ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినోతో ఫోన్‌లో మాట్లాడిన తర్వాతే ఈ నిర్ణయం వెలువడిందన్న వార్తలు ప్రపంచ ఫుట్‌బాల్ వర్గాల్లో సంచలనం సృష్టించాయి. దీంతో క్రీడల్లో రాజకీయ జోక్యంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. అమెరికా ప్రభుత్వానికి చెందిన ఓ అధికారి ఈ విషయంపై మాట్లాడారు. 'బలోగన్‌కు రెడ్ కార్డు ఎందుకు ఇచ్చారు? ఎందుకు సస్పెన్షన్ విధించారు? అనే అంశంపై అధ్యక్షుడు ట్రంప్ ఫిఫా అధ్యక్షుడు ఇన్ఫాంటినోతో మాట్లాడారు. అనంతరం అప్పీల్ ప్రక్రియలో అమెరికా ప్రభుత్వం అదనపు ఆధారాలు సమర్పించింది. స్వతంత్ర కమిటీ వాటిని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంది' అని వెల్లడించారు. బోస్నియా–హెర్జెగొవినాపై జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో 64వ నిమిషంలో ప్రత్యర్థిని కాలుతో అడ్డుకున్నందుకు బలోగన్‌కు రిఫరీ రెడ్ కార్డు చూపించారు. సాధారణంగా రెడ్ కార్డ్ అందుకున్న ప్లేయర్ ఒక మ్యాచ్ నిషేధం ఎదుర్కొవాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఫిఫా క్రమశిక్షణ కమిటీ ఆ సస్పెన్షన్‌ను అమలు చేయకుండా నిలిపివేసింది. ఈ మేరకు అధికారికంగా ఆ విషయాన్ని ధ్రువీకరించింది. దీంతో బెల్జియంతో జరిగే ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌కు బలోగన్ అందుబాటులోకి వచ్చాడు. ఇప్పటికే ఈ ప్రపంచ కప్‌లో మూడు గోల్స్ చేసిన అతడు.. అమెరికాలో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

### ఫిఫాకు ధన్యవాదాలు: ట్రంప్

బలోగన్‌పై నిషేధం ఎత్తివేయగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'సరైన నిర్ణయం తీసుకున్నారు. ప్లేయర్‌కు అన్యాయం జరగకుండా చూసిన ఫిఫాకు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అయితే ఫిఫా నిర్ణయంపై బెల్జియం ఫుట్‌బాల్ సమాఖ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నిబంధనలను తప్పుగా అమలు చేశారని ఆరోపిస్తూ అన్ని న్యాయపరమైన అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. నార్వే ప్రధాన కోచ్ స్టాలే సోల్‌బక్కెన్ కూడా ఫిఫాపై తీవ్ర విమర్శలు గుప్పించాడు. 'రెడ్ కార్డు ఇచ్చారు.. వీఏఆర్ కూడా దానిని సమర్థించింది. అలాంటప్పుడు ఒక మ్యాచ్ నిషేధం తప్పనిసరి. ఇప్పుడు దాన్ని రద్దు చేయడం పెద్ద తప్పు. అమెరికా గెలిచినా ఈ వివాదం వారి విజయంపై నీడలా వెంటాడుతుంది. ఇకపై ప్రతి రెడ్ కార్డుపైనా రాజకీయ ఒత్తిడి వస్తే పరిస్థితి ఏమిటి? ఇది ప్రపంచ కప్ ప్రతిష్ఠను దెబ్బతీసే నిర్ణయం' అని సోల్‌బక్కెన్ మండిపడ్డాడు.

## ఆ ముగ్గురు గ్రేట్ సైంటిస్టులకు ఘన నివాళి.. అంతరిక్షంలోకి సూక్ష్మ విగ్రహాలు..

ఇంటర్‌నెట్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

భారతదేశానికి చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' చరిత్రాత్మక అంతరిక్ష ప్రయోగానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. స్కైరూట్ సంస్థ ఈ నెలలో 'మిషన్ ఆగమన్' పేరిట 'విక్రమ్–×' రాకెట్‌ను శ్రీహరికోట నుంచి అంతరిక్షంలోకి పంపనుంది. ఈ ప్రయోగం ద్వారా స్కైరూట్ సంస్థ దేశానికి చెందిన ముగ్గురు గొప్ప సైంటిస్టులకు ఘన నివాళి తెలపడానికి సిద్ధమైంది. 'విక్రమ్–×' రాకెట్‌లో సర్ సీవీ రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల సూక్ష్మ విగ్రహాలను అంతరిక్షంలోకి పంపనుంది. మైక్రో ఆర్టిస్ట్ అజయ్ కుమార్ మట్టెవాడ 18 క్యారెట్ల బంగారంతో ఒక చిన్న రాకెట్ ఆకృతిని తయారు చేసి.. అందులో ఈ



ముగ్గురు సైంటిస్టుల విగ్రహాలను చెక్కారు. ఈ విగ్రహాలు ఒక్కోటి బియ్యపు గింజ కంటే చాలా చిన్నవిగా ఉంటాయి. భారతదేశాన్ని అంతరిక్ష రంగంలో సూపర్ పవర్‌గా నిలిపిన ఆ ముగ్గురు మహానుభావుల గౌరవార్థం స్కైరూట్ ఈ వినూత్న ప్రయత్నం చేస్తోంది. ముగ్గురు సైంటిస్టుల సూక్ష్మ విగ్రహాలతో పాటు భారతదేశానికి చెందిన ప్రముఖ ల్యాబ్ గ్రోన్ డైమండ్ జ్యువెలరీ బ్రాండ్ తయారు చేసిన 'కాస్మిక్ బ్లూమ్' కళాఖండం కూడా అంతరిక్షంలోకి ప్రయాణించనుంది.

## కాళేశ్వరం పేరుతో కేటీఆర్ డ్రామాలు చేస్తున్నారు.. మంత్రి సీతక్క ఎద్దేవా

మహబూబాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం పేరుతో ఆయన డ్రామాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈరోజు (సోమవారం) మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అధికార దాహమే తప్ప... ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉండి ఆయన ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. కూలిపోయింది బీఆర్ఎస్ హయాంలోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ కొట్టుకుపోవాలని కేటీఆర్ చూస్తున్నారా..? అని మంత్రి సీతక్క ప్రశ్నించారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు.. అల్లుఅర్జున్ వర్చువల్ హాజరుకు కోర్టు అనుమతి

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై ఈరోజు(సోమవారం) నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా టాలీవుడ్ హీరో అల్లుఅర్జున్‌కు వర్చువల్‌గా అటెండ్ అయ్యేందుకు న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. అల్లుఅర్జున్ ముంబై షూటింగ్‌లో ఉండడంతో వర్చువల్‌గా హాజరయ్యేందుకు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఈ కేసులో నిందితులు కొంతమంది వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరుకాలేదు. దీంతో తదుపరి విచారణను కోర్టు ఈనెల(జులై) 29కి వాయిదా వేసింది. ఈ కేసులో 23 మంది నిందితులకు సంబంధించి 500 పేజీల ఛార్జ్‌షీట్ కాపీలను కోర్టుకు పీపీ అందజేశారు. ఈ కేసుకు సంబంధించి గత విచారణలోనూ అల్లుఅర్జున్ వర్చువల్‌గా అటెండ్ అయిన విషయం తెలిసిందే. ఈరోజు విచారణకు సంబంధించి కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సిందిగా అర్జున్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. అయితే అర్జున్ షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారని, ముంబైలో ఉన్నందుకు వర్చువల్‌గా విచారణకు హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు కోర్టు అనుమతించింది.

## రాజకీయంగా ఎదిగేందుకు రాముని పేరు వాడుకున్నారు..

బీజేపీపై పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

సిద్దిపేట,

శ్రీరామునికి రామ జన్మభూమిలో రామ మందిరం నిర్మాణానికి ప్రజలు ఎవరి స్థితికి తగ్గట్టు వారు విరాళాలు ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. విరాళాల్లో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. బీజేపీ నాయకులు.. రాముని పేరుతో, అక్షింతలపై విరాళాలు అడుక్కున్నారని విమర్శించారు. బీజేపీ నాయకుల అవినీతిని గుర్తించి అయోధ్య ప్రజలే ఆ పార్టీ ఎంపీని ఓడించారన్నారు. ఈ విషయంలో బీజేపీ స్పందించి.. దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఎదగడానికి రాముని పేరును కమలం పార్టీ వాడుకుందని ఆరోపించారు. రాజకీయం వేరు, భక్తి వేరని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రిదే బాధ్యత అని అన్నారు. రాముడి హుండీలోని విరాళాలను ఎత్తుకెళ్లడం దేశ ప్రజలకు అవమానకరమన్నారు. భక్తి పేరుతో, రాముని పేరుతో రాజకీయం చేసే వారి రంగును ప్రజలు గుర్తించాలని తెలిపారు. దేవుడి పేరుపై బీజేపీ స్కాం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

## గంజాయి రవాణా అరికట్టేందుకు కార్యాచరణ: డీజీపీ సీవీ ఆనంద్

మణుగూరు, : అన్వేషనేత్రం ప్రతినిధి

రాష్ట్రంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గంజాయి పెంచే వారిని తీవ్రవాదుల కంటే ఎక్కువగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని ఈ సందర్భంగా పోలీసులకు ఆయన సూచించారు. ప్రజలకు ఆటంకం కలగకుండా శాంతి భద్రతలు కాపాడాలని పోలీసులకు తెలంగాణ డీజీపీ స్పష్టం చేశారు. ఏఐ టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసులకు వివరించారు. యువత డ్రగ్స్‌కి అలవాటు కాకుండా ఉండేందుకు కఠినమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మావోయిస్టులను పూర్తిగా అదుపు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్తగా మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని పోలీసులకు స్పష్టం చేశారు.

## కన్నెపల్లి వద్ద లక్ష క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి: కెటిఆర్

హైదరాబాద్:

మాజీ సిఎం కెసిఆర్ ప్రభుత్వం వచ్చాక సాగునీరు విస్తీర్ణం పెరిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. హమాలీల సమస్యలను తీర్చే బాధ్యత బిఆర్ఎస్ దేనని కెసిఆర్ అన్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రూ. 8 ఉన్న రూ. 26 చేసుకున్నాం..260 శాతం పెంచుకున్నామని, దేశ ప్రజలకు బువ్వ పెట్టింది రైతులైతే ధాన్యం బస్తాలు మోసింది హమాలీలు అని తెలియజేశారు. ఢిల్లీకి బస్తాలు మోసి సిఎం రేవంత్ రెడ్డి అవస్థలు పడుతున్నారని, దేశమంతా వర్షాలు లేవు..తెలంగాణలో 23 జిల్లాలో లేవు అని విమర్శించారు. కన్నెపల్లి వద్ద లక్ష క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని, వర్షాలు లేకున్నా, కరువు ఉన్నా, మండు వేసవిలో నీళ్లు ఉండేలా ఉన్న ప్రాంతంలో కాళేశ్వరం కట్టినామని కెటిఆర్ పేర్కొన్నారు.



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్: గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# ఆయారామ్ గయారామ్‌లకు అడ్డేదీ?



పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఇటీవల కొంతమంది ఎంఎల్ఎలు, ఎంపిల పార్టీ ఫిరాయింపులు ఎంతటి రాజకీయ సంక్షోభాన్ని సృష్టించాయో తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయం పొందిన తరువాత సుమారు 60మంది టిఎంసి ఎంఎల్ఎలు, 20 మంది ఎంపిలు తిరుగుబాటు బావుటా ఎగరేశారు. బహిష్కృత నేత రీతబ్రత బెనర్జీని తమ నాయకుడుగా 60మంది టిఎంసి ఎంఎల్ఎలు ఎన్నుకున్నారు. లోక్‌సభలో టిఎంసి ఎంపిలు కకోలీఘోష్ దస్తీదార్ నేతృత్వంలో పార్టీనుంచి విడిపోయి నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యారు. ఈ తిరుగుబాటుదారులకు బిజెపి మద్దతు ప్రకటించడం గమనార్హం. అలాగే మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) నుండి ఏక్‌నాథ్ షిండే వర్గంలోకి ఎంపిలు, ఎంఎల్ఎలు భారీగా ఫిరాయింపులకు పాల్పడ్డారు. థాక్రే శిబిరానికి ఇది పెద్ద ఎదురు దెబ్బ కాగా, దీనిని షిండే వర్గం 'ఆపరేషన్ టైగర్'గా అభివర్ణించింది. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రజాస్వామ్య విలువలకు నేతలు ఎంతవరకు కట్టుబడి ఉన్నారో, ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంత బలహీన పరుస్తున్నారో ప్రత్యక్షమవుతోంది. 'తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు' అన్న సుమతీ శతక నానుడి జ్ఞాపకం వస్తోంది. ఈ ఫిరాయింపుల జాడ్యం ఏ ఒక్క రాష్ట్రానికి పరిమితం కాలేదు. దేశం మొత్తం మీద ఇదే ధోరణి కొనసాగుతోంది. ఈ ఫిరాయింపుల వల్ల అంతవరకు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కూడా కుప్పకూలిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. 1952 నుంచి 1967 వరకు మొత్తం 542 ఫిరాయింపులు జరగ్గా, 1967 మార్చి నుంచి 1968 ఫిబ్రవరి మధ్య కాలంలోనే దాదాపు 438 మంది శాసనసభ్యులు పార్టీలను ఫిరాయించడం గమనార్హం. 1967లో గయాలాల్ అనే శాసనసభ్యుడు ఒక్క రోజులోనే మూడుసార్లు పార్టీలను ఫిరాయించి ఆయారామ్ గయారామ్ అనే అపఖ్యాతికి అంకురార్పణ చేశాడు. ఇంతవాడు అంతంతై దీంతో ఈ ఫిరాయింపులను నివారించడానికి తగిన చట్టం రూపకల్పనకు వైబి చవాన్ అధ్యక్షతన కమిటీ కొన్ని సిఫార్సులను చేసింది. ఒక పార్టీ నుంచి మరో పార్టీకి మారే ప్రజాప్రతినిధిని అంటే ఫిరాయింపుదారుడిని మంత్రి పదవి, స్పీకర్ పదవి లేదా ప్రభుత్వం ద్వారా ధనలబ్ధి పొందే ఎలాంటి పదవుల్లోనైనా ఏడాది పాటు, మళ్లీ ఎన్నికయ్యేవరకు నియమించకూడదని కమిటీ సిఫార్సు చేసింది. ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, అలాంటివారికి ఎలాంటి పదవులు దక్కకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. దీంతో 1985లో రాజ్యాంగం లోని 52 సవరణ ద్వారా పార్లమెంట్ చివరకు పార్టీ ఫిరాయింపుల వ్యతిరేక చట్టాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో చేర్చింది. అయితే ఆ తర్వాత వ్యక్తులు పార్టీలు మారడం అనేది పెద్ద ఎత్తున ముందస్తు ప్రణాళికతో చేసిన కుట్రల ద్వారా పార్టీలు ముక్కలు కావడానికి దారితీసింది. ఒక పార్టీకి చెందిన శాసనసభ్యుల్లో 1/3 వంతు మంది విడిపోవడాన్ని చట్టబద్ధం చేయడంవల్ల ఆ నిబంధన పార్టీ మారడానికి, ప్రభుత్వాన్ని కూల్చడానికి, తామే అధికారంలోకి రావడానికి ఒక లైసెన్స్‌లా ఉపయోగపడింది. గతంలో రాజ్యాంగం లోని 10వ షెడ్యూల్, పారాగ్రాఫ్ 3 ప్రకారం ఒక పార్టీ ఎంఎల్ఎల్లో 1/3 వంతు మంది ఒకేసారి వేరుపడితే వారిని చట్టవ్యతిరేక ఫిరాయింపుదారులుగా పరిగణించేవారు కాదు. ఈ మినహాయింపును అడ్డంపెట్టుకుని స్వార్థప్రయోజనాల కోసం పార్టీలను మార్చేవారు. చివరికి ప్రభుత్వాన్ని కూడా కూలగొట్టేవారు. దీన్ని నివారించడానికి, ఈ చట్టాన్ని మరింత ప్రభావంతం చేయడానికి 2003లో 91వ రాజ్యాంగ సవరణద్వారా ఈ పారాగ్రాఫ్ 3 ని రద్దు చేసి పరిమితిని 1/3 నుంచి 2/3 (మూడింట రెండు వంతులు)కు పెంచారు. అయినా ఫిరాయింపుల పీడ విరగడ కాలేదు. కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ 2010, 2021, 2025 లో లోక్‌సభలో ప్రైవేట్ మెంబర్ బిల్లులు ప్రవేశపెట్టారు. చర్చలు రాజ్యాంగం లోని 10వ షెడ్యూల్ (ఫిరాయింపుల నిరోధక చట్టం)కు సవరణలు చేయాలని ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రతిపాదనల ప్రకారం పార్టీ విప్ పరిమితిని తగ్గించవలసి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం ఒక ఎంపి తన పార్టీ ఆదేశానికి విరుద్ధంగా ఓటు వేస్తే లేదా ఓటింగ్‌కు దూరంగా ఉంటే తన సభ్యత్వాన్ని కోల్పోవలసి వస్తుంది. ఇలా జరగకుండా ప్రభుత్వ మనుగడకు సంబంధించిన ముఖ్యమైన విషయాలు (ఉదాహరణకు అవిశ్వాస తీర్మానం, విశ్వాసతీర్మానం, మనీబిల్లు) తప్ప మిగిలిన సాధారణ చట్టాలపై ఎంపిలు తమ మనస్సాక్షి ప్రకారం స్వతంత్రంగా, ఓటు వేసే స్వేచ్ఛను ఈ ప్రైవేట్ బిల్లు కోరుతోంది. సభ్యుడు పార్టీ ఫిరాయించిన వెంటనే ఆటోమేటిక్‌గా పార్టీ సభ్యత్వాన్ని కోల్పోవాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. ఒకవేళ ఆ ఎంపిపై అనర్హత వేటు పడితే ఆ ఎంపి 15 రోజుల్లోగా స్పీకర్/ ఛైర్మన్‌లకు అప్పీలు చేసుకోవచ్చు. ఆ అప్పీలును 60 రోజుల్లోగా పరిష్కరించాలని బిల్లు స్పష్టం చేసింది. పార్టీ ఆదేశాల 'బానిసత్వం' నుంచి సభ్యునికి విముక్తి కల్పించడమే ఈ ప్రతిపాదన అసలు ఉద్దేశం. ప్రజాస్వామ్య వ్యవస్థను అత్యంత దారుణంగా నిర్వీర్యం చేస్తున్న దృశ్యాలు కళ్లముందు జరుగుతున్నా మౌనప్రేక్షకుల్లా ఉండిపోవలసిన పరిస్థితి కొనసాగుతోంది. ఫిరాయింపుదార్ల పార్టీ సభ్యత్వాన్ని, పదవులను ఎలాంటి మినహాయింపులు లేకుండా వెంటనే రద్దు చేయడం అవసరం. ఈ మేరకు ఒకే ఒక వాక్యంతో కఠినమైన చట్టాన్ని పార్లమెంట్ తక్షణం అమలు లోకి తీసుకు రావాలి.

# మార్కెట్లోకి న్యూ హార్నెట్ 125, షైన్ 100 డిఎక్స్

## ఆవిష్కరించిన రవాణా, యూత్ అండ్ స్పోర్ట్స్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

అనంతపురం : అనంతపురం ఆర్ ఎఫ్ రోడ్ లోని శివ సాయి హెూండా షోరూంలో ఇటీవల హెూండా సంస్థ రూపొందించిన న్యూ హార్నెట్ 125, షైన్ 100 డిఎక్స్ సరికొత్త ద్విచక్ర మోడల్స్ ను రాష్ట్ర రవాణా, యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ %ి% యువతకు నచ్చే విధంగా హెూండా సంస్థ వాహనాలను రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా శివ సాయి హెూండా సంస్థ 21 సంవత్సరాలుగా సుదీర్ఘమైన సేవలు అందించి ప్రజల ఆదరణ పొందడం అభినందనీయమన్నారు. ఈ నేపథ్యంలో 21 వ వార్షికోత్సవం సందర్భంగా తీసిన లక్కీ డ్రా లో సత్య సాయి జిల్లా చెన్నే కొత్తపల్లికి చెందిన వంశీకృష్ణకు లక్కీ డ్రాలో లభించిన ఆపిల్ మొబైల్ ను మంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ నేపథ్యంలో శివ సాయి హౌండా అధినేత మల్లికార్జున




మాట్లాడుతూ వాహనదారులకు శివ సాయి హెూండా రెండు దశాబ్దాలుగా సేవలందించి ఆదరణ పొందామని చెప్పారు. భవిష్యత్తులోనూ నాణ్యమైన నమ్మకమైన సేవలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ వీర్రాజు, సిటీ యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజేష్ శివ సాయి హెూండా సేల్స్ మేనేజర్ శేషాద్రి, సర్వీస్ మేనేజర్ షఫీ, టాటా గోల్డ్ ఇన్చార్జ్ రావు, శివ సాయి హెూండా అకౌంటెంట్ రాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖర్చులతో సతమతం

## అయోమయంలో 58 శాతం కుటుంబాలు

## వాల్డ్‌పానెల్ బై నుమెరేటర్ రిపోర్ట్

న్యూఢిల్లీ :

పెరిగిన ధరలు, ఖర్చులతో దేశంలోని సగంపైగా కుటుంబాలు సతమతం అవుతోన్నాయి. ఖర్చులను ఎలా అధిగమించాలో అర్థం కావడం లేదని 58 శాతం కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయని వాల్డ్‌పానెల్ బై నుమెరేటర్ రిపోర్ట్‌లో తెలిపింది. వినియోగదారులు ట్రెండ్స్‌ను పరిశోధించే ఈ గ్లోబల్ రీసెర్చ్ సంస్థ 6,000పైగా కుటుంబాల అభిప్రాయాలతో.. ఖర్చా 3.0 అనే అధ్యయనం చేసింది. ఆ వివరాలు.. 2025 మార్చితో ముగిసిన త్రైమాసికంలో భారతీయుల కుటుంబాల సగటు వ్యయాలు 14 శాతం పెరిగి రూ.56,135కు చేరింది. ఇది ఆదాయం కంటే ఎక్కువని వెల్లడించింది. 2022లో సగటు త్రైమాసిక ఖర్చులు సుమారు రూ.42,000గా ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలు, తక్కువ ఆదాయాలు గల వర్గాలు ఖర్చులలో ఏకంగా 18 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. అదే విధంగా నగరాల్లోని ఉన్నత ఆదాయ కుటుంబాల్లో కూడా త్రైమాసిక ఖర్చులలో 15 శాతం పెరుగుదల నమోదయ్యింది. భారతీయ కుటుంబాల్లో గత మూడేళ్లలో ఆర్థిక ఒత్తిడి విపరీతంగా పెరిగింది. వినియోగదారులు అవసరమైన ఖర్చులను, రుణ బాధ్యతలను సమతుల్యం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. "ఖర్చులు పెరుగుతున్న నగర, గ్రామీణ ప్రాంతాల్లో చాలా కుటుంబాలు అవసరమైన వస్తువులు, పొదుపు, రుణ చెల్లింపులకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. వినియోగదారులు తమ ఎంపికలలో మరింత జాగ్రత్తగా ఉంటున్నారు. బ్రాండ్‌లకు ఇది ఒక కీలక సమయం. వారు వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సరసమైన, అవసరమైన, బాధ్యతాయుతమైన విలువను అందించే విధంగా తమ వ్యూహాలను రూపొందించాలి." అని వరల్డ్‌ప్యానల్ బై న్యూమరేటర్ సౌత్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ కె రామకృష్ణన్ అన్నారు. దేశంలోని 58 శాతం కంటే ఎక్కువ గృహాలు ఖర్చులను నిర్వహించడంలో ఇబ్బంది పడుతున్నాయని తమ రిపోర్ట్‌లో తేలిందన్నారు. ఇది గత సంవత్సరం 38 శాతంతో పోల్చితే చాలా ఎక్కువన్నారు. కేవలం 17 శాతం కుటుంబాలు మాత్రమే సౌకర్యవంతంగా జీవిస్తున్నాయన్నారు. మిగిలినవారు ఏదో విధంగా ఖర్చులను నిర్వహిస్తున్నాయన్నారు. బడ్జెట్‌లు కుంచించుకుపోతుండటంతో భారతీయ వినియోగదారులు తమ ఖర్చులను ప్రాథమిక అవసరాలపై కేంద్రీకరిస్తున్నారన్నారు. సుమారు 80 శాతం మంది అవసరమైన కిరాణా సామాగ్రిని మాత్రమే కొంటున్నట్లు తెలిపారు. చాలా మంది చౌకైన బ్రాండ్‌లకు మారుతున్నారు. ఆకస్మిక కొనుగోళ్లను తగ్గిస్తున్నారన్నారు.



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్: గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# పేపర్‌పై 18 శాతం జిఎస్‌టి అనుచితం

## కాగితం విలాస వస్తువు కాదు

## తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ ఆందోళన

బిజినెస్ బ్యూరో : కేంద్ర ప్రభుత్వం కాగితంపై 18 శాతం వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వేసిందని.. ఇది అనుచితమని తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అభిషేక్ విజయవార్జీ అన్నారు. పేపర్ విలాస వస్తువు కాదని.. ఇది అత్యవసర వస్తువని ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, ప్రచురణకర్తలు, ప్రింటర్లు, ప్యాకేజింగ్ పరిశ్రమ సహా సమాజంలో ఎంతో మంది ప్రతిరోజూ ఉపయోగించే ఒక అత్యవసర వస్తువు కాగితం అన్నారు. దీనిపై ఇటీవల జిఎస్‌టిని 18 శాతానికి పెంచడం వల్ల విద్య, సంబంధిత పరిశ్రమలపై అధిక భారం పడుతుందన్నారు. కాగితం కేజీ రూ.70, జిఎస్‌టి ఐదు శాతం కలిపితే రూ.73.50 అవుతుందన్నారు. అదే 18 శాతం జిఎస్‌టి అయితే రూ.82.60 అవుతుందన్నారు. కిలోపై అదనంగా 12 శాతం భారం పడనుందన్నారు. నూతన జిఎస్‌టితో నోటుబుక్స్, పాఠ్య పుస్తకాలు, పరీక్ష పత్రాలు, ప్యాకేజింగ్, రోజువారీ ఉత్పత్తులపై అనేక రెట్లు పెరుగుతుందని చెప్పారు. దేశంలో కాగితం పరిశ్రమ అడవులను నరకడం లేదన్నారు. సొంతంగా చెట్లను సాగు చేస్తుందన్నారు. కాగితంపై జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు.



# బాబు జగ్జీవన్ రామ్ గారి 40వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**నల్లగొండ,జూలై 6 ( అన్వేషనేత్రం ప్రతినిధి):**

భారత మాజీ ఉప ప్రధానమంత్రి, సామాజిక న్యాయ సాధకుడు, మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ గారి 40వ వర్ధంతి సందర్భంగా నల్గొండ పట్టణంలోని నాగార్జున డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద మహనీయులు ఆశయ సాధన సమితి (మాస్), అంబేద్కర్--జగ్జీవన్ రామ్ భవన అభివృద్ధి కమిటీ, అంబేద్కర్ యువజన సంఘం, మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. మాస్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పెరిక కరణ్ జయరాజ్, జిల్లా అధ్యక్షులు శ్రీ కత్తుల జగన్ కుమార్, గౌరవ అధ్యక్షులు శ్రీ కత్తుల షణ్ముఖ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీ పెరిక ఉమా మహేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, న్యాయవాదులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ ఎస్పీ శ్రీ రమేష్, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి శ్రీమతి శశికళ, అంబేద్కర్--జగ్జీవన్ రామ్ భవన అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీ బొర్రా సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో, సామాజిక న్యాయ సాధనలో, అణగారిన వర్గాల అభ్యున్నతిలో అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్ ప్రధాన కార్యదర్శి శ్రీ కందుల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు శ్రీ కొప్పోలు అశోక్, శ్రీ వట్టపు శ్రవణ్, శ్రీ చింత శివరామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ కో-ఆప్షన్ సభ్యులు శ్రీ తీగల జాన్ శాస్త్రి, శ్రీ మైనం విక్రమ్, దళిత సంఘాల ఐకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ పడిదల నవీన్ కుమార్, పట్టణ కార్పొరేటర్లు శ్రీ పెరిక యాదయ్య, శ్రీ బొజ్జ శంకరయ్య, శ్రీమతి స్వాతి రాజశేఖర్, శ్రీ దీప్లా నాయక్, పట్టణ మాస్ అధ్యక్షులు శ్రీ ఇరిగి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీ కత్తుల సన్నీ, ఉపాధ్యక్షులు శ్రీ పెరిక హరి ప్రసాద్, శ్రీ పెరిక అంజయ్య, శ్రీ పేర్ల నరేందర్, శ్రీ పగడాల శివ, శ్రీ బొజ్జ సైదులు, శ్రీ బొజ్జ పాండు, శ్రీ కుడుతల నాగరాజు, శ్రీ మాతంగి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక అంబేద్కర్--జగ్జీవన్ రామ్ భవనంలో భవన అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీ బొర్రా సుధాకర్ ఆధ్వర్యంలో మరోసారి బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



ఈ రోజు తెలంగాణ ప్రదేశ్ గాంధీ భవన్ లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళ కార్యవర్గ సమావేశం లో ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు శ్రీమతి ఆల్కాలంబ గారు పాల్గొని దిశ నిర్దేశం చేశారు.. ఈ కార్యవర్గ సమావేశం లో సహచర ముఖ్య మహిళ నేతలతో కలిసి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి చింతల నిర్మల రెడ్డి గారు పాల్గొనారు.. ఈ సందర్భంగా తెలంగాణ లో మహిళ సాధికారత, మహిళ నాయకత్వ బలోపేతం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు తదితర ముఖ్య అంశాల పై చర్చించారు..

మీ.

శ్రీమతి చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి గారు.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్








నల్గొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎడ్ల శ్రీను గారికి ఘన సన్మానం చేయడం జరిగింది

ఈ సందర్భంగా నాయకులు శాలువాలు కప్పి, అభినందనలు తెలియజేస్తూ వారి నాయకత్వంలో నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 29వ డివిజన్ మాజీ కౌన్సిలర్ ఇంతియాజ్ అలీ గారు ఉమాజీ కౌన్సిలర్ ప్రదీప్ నాయక్ గారు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండబోయిన మల్లయ్య గారు హన్ను,మున్నా ,పేరం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





హైదరాబాద్, జూలై 6, 2026:
భారత రత్న, సామాజిక న్యాయ సాధకుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ దళిత విభాగం చైర్మన్, మానకొండూరు శాసనసభ్యులు శ్రీ కవ్వంపల్లి సత్యనారాయణ గారి ఆదేశాల మేరకు, టీపీసీసీ దళిత విభాగం అధికార ప్రతినిధి హెచ్.ఆర్. మోహన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బాబూ జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం, సమానత్వం, దళిత సాధికారత కోసం చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో టీపీసీసీ దళిత విభాగం రాష్ట్ర చైర్మన్ ముంజగళ్ల విజయకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అడ్వకేట్ నరేన్ రాజా అనేరాలి, జీవన్ జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి బారా రాజ్ కుమార్, ఖైరతాబాద్ జిల్లా చైర్మన్ బైండ్ల శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా చైర్మన్ నిఖిల్, వైస్ చైర్మన్ సిహెచ్ వినోద్ సింగ్ నాయకులు దబెట రమేష్, ఇంజామూరి, యాదగిరి, తిప్పర్తి శ్రీధర్ తదితరులు పాల్గొని బాబూజీకి ఘన నివాళులర్పించారు.





**హైదరాబాద్:-**



అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్‌లుగావారి వారి ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ గారు,ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ గారు,ఎమ్మెల్యే వేముల వీరేశం గార్లకు తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో కేటాయించిన ప్రత్యేక కార్యాలయాలను రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు ప్రారంభించారు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్‌లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,ప్రజా సమస్యల పరిష్కారంలో,ప్రభుత్వ కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో వారు మరింత విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గారు,ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు,ఉన్నతాధికారులు,నాయకులు,మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.







సమానత్వానికి చిహ్నం.

నిరంతర పోరాట యోధుడు.

హరిత విప్లవ సారథి

ప్రజాస్వామ్య రక్షకుడు

బాబు జగజీవన్ రామ్ గారు.

ఆయన సమానత్వం మరియు సామాజిక న్యాయానికి ఒక నిలువెత్తు రూపం.

బాబు జగజీవన్ రామ్ గారి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించిన ఎవీ౯ాూ వ్యవస్థాపక అధ్యక్షులు ఉ మాజీ సెలబ్రేషన్ వర్కింగ్ కమిటీ చైర్మన్, ఇటుక రాజు మాదిగ గారు

ఎవీఎణ వ్యవస్థాపక అధ్యక్షులు జన్ను కనకరాజు మాదిగ గారు,

ఇటుక గోపి మాదిగ, పరుశురాములు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఈరోజు రంగారెడ్డి జిల్లా పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గంలో గల బాలాపూర్ డివిజన్(62)
+ఎవీజ పరిధిలో స్వాతంత్ర సమరయోధులు, భారత మాజీ ఉప ప్రధాని
బాబు జగ్జీవన్ రామ్ గారి వర్ధంతి సందర్బంగా వారికి ఘన నివాళులు అర్పించిన రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్ గారు మహనీయుల స్మృతులను గుర్తుచేసుకున్నారు. వారు చేసిన సేవలను నెమరువేసుకున్నారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్ ఎమ్మెల్యే "శ్రీ వేముల వీరేశం గారికి విప్ క్యాంపు కార్యాలయం కేటాయింపు" కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు..!నకిరేకల్ శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారికి తెలంగాణ శాసనసభ పరిధిలో విప్ క్యాంపు కార్యాలయం కేటాయించిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీ అద్దంకి దయాకర్ గారు, మిర్యాలగూడ ఎమ్మెల్యే శ్రీ బత్తుల లక్ష్మారెడ్డి గార్లతో కలిసి నూతన క్యాంపు కార్యాలయాన్ని సందర్శించి, ఎమ్మెల్యే శ్రీ వీరేశం గారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ గారు మాట్లాడుతూ, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడంలో క్యాంపు కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.






## పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జులై :06 (అన్వేషనేత్రం):**

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఉద్యోగుల ఆరోగ్యమే సంస్థ అభివృద్ధికి మూలస్తంభం: డీఆర్‌డీఓ శ్రీ వై. శేఖర్ రెడ్డి





**నల్లగొండ, జులై 6 ( అన్వేషనేత్రం ప్రతినిధి ):**

ఎరిక్సన్ మరియు యశోద హాస్పిటల్ వైద్య బృందాల సహకారంతో ఈరోజు టీటీడీసీ సెంటర్‌లో డీఆర్‌డీఏ, సెర్ప్ (రాజు-రా) మరియు ఈజీఎస్ ఉద్యోగుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరం (హెల్త్ క్యాంప్) విజయవంతంగా నిర్వహించబడింది. ఈ ఆరోగ్య శిబిరాన్ని డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ వై. శేఖర్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఉద్యోగుల ఆరోగ్యమే సంస్థ అభివృద్ధికి, సమర్థవంతమైన పనితీరుకు మూలస్తంభం" అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించే ఫీల్డ్ స్థాయి ఉద్యోగులు అధిక శారీరక శ్రమతో పాటు పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, అలాగే కార్యాలయ సిబ్బంది కంప్యూటర్ల ముందు ఎక్కువసేపు పనిచేయడం వల్ల వివిధ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా సకాలంలో మెరుగైన చికిత్స అందించడంతో పాటు భవిష్యత్తులో తీవ్రమైన అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు. ప్రతి ఉద్యోగి తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వైద్యులు సూచించే సలహాలను పాటించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, డిఆర్డిఏ, సెర్ఫ్ సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## దేవరకొండ అభివృద్ధి కాంక్షకు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కలిసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

నల్లగొండ, జులై 6 ( అన్వేషనేత్రం ప్రతినిధి ):

హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి శ్రీ బట్టి విక్రమార్కను దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా మెరుగుదల, విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతం, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేయడం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల విస్తరణతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని, దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు 76

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



ప్రజావాణి దరఖాస్తులను





**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జులై: 06 (అన్వేషనేత్రం):**

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు,డీపీఓ 5 మున్సిపాలిటీ 5, డిడబ్ల్యూఓ 4 మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 76 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజు, జడ్ పిసిఇఓ శిరీష డీపీఓ యాదగిరి, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ్, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, సిపిఓ కిషన్ డిఇఓ అశోక్ , సంక్షేమ అధికారులు నరసింహారావు, దయానంద రాణి ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు.

## అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్‌లకు కొత్త కార్యాలయాల ప్రారంభం-- ప్రజాసేవలో సమన్వయానికి కొత్త దిశ





**నల్లగొండ, జులై 6 ( అన్వేషనేత్రం ప్రతినిధి ):**

అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్‌లుగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో కేటాయించిన ప్రత్యేక కార్యాలయాలను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం అసెంబ్లీ ప్రాంగణంలో సజీవ వాతావరణాన్ని సంతరించుకుంది. నూతనంగా ప్రభుత్వ విప్‌లుగా బాధ్యతలు స్వీకరించిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రజా సేవలో వారి పాత్ర మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన నిర్వహణలో ప్రభుత్వ విప్‌లు కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. అదే సమయంలో అసెంబ్లీ ప్రాంగణంలో కొత్త కార్యాలయాల ప్రారంభాన్ని ఆయన ఒక "ప్రజాసేవా సమన్వయ కేంద్రం"గా అభివర్ణిస్తూ, శాసనసభ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా, ప్రజలకు దగ్గరగా జరిగేందుకు ఈ కార్యాలయాలు దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల వద్దకు వేగంగా చేరేందుకు విప్‌ల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమ్ నరేందర్ రెడ్డి, అలాగే ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నూతన కార్యాలయాల ప్రారంభంతో అసెంబ్లీ ప్రాంగణంలో పరిపాలనా సమన్వయం మరింత బలోపేతం అవుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇది మరింత వేగం తీసుకువస్తుందని పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు.

# జర్నలిస్టుల పిల్లలకు 75% ఫీజు రాయితీ వెంటనే అమలు చేయాలి

### లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం: టీయూడబ్ల్యూజే (ఐజేయూ)

### కలెక్టరేట్ ఎదుట ధర్నా, రాస్తారోకో.. అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం





**నల్లగొండ, జులై 6 (అన్వేషణ నేత్రం ప్రతినిధి):**

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 75 శాతం ఫీజు రాయితీ తక్షణమే అమలు చేయాలని, లేదంటే దశలవారీగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ డిమాండ్‌తో సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రైవేటు విద్యాసంస్థల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఫీజుల భారం జర్నలిస్టుల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొందరు జర్నలిస్టుల పిల్లలు చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన దుస్థితి నెలకొనడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జర్నలిస్టుల పిల్లలకు 75 శాతం ఫీజు రాయితీ అమలు చేస్తూ సర్క్యులర్లు జారీ చేసిన నేపథ్యంలో, నల్లగొండ జిల్లాలోనూ అదే విధానాన్ని వెంటనే అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్, సంబంధిత అధికారులతో చర్చించి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ అమలయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్ రావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు పరమేష్, ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మాదారి యాదగిరి, అశ్వక్ అహ్మద్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆబ్బోజు మదనాచారి, ప్రధాన కార్యదర్శి పిట్టల రామకృష్ణ, గంగాధర వెంకటేశ్వర్లు, వీడియోగ్రాఫర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.కే. సలీం, అలాగే జర్నలిస్టులు, వివిధ సంఘాల నాయకులు ఎండి సయ్యద్, జిల్లా యాదయ్య, కత్తుల యాదగిరి, చంద్రశేఖర్, ఊర రమేష్, రాంప్రసాద్, గుడిపాటి శ్రీనివాస్, సందీప్, సోమశేఖర్, అశోక్ కుమార్, డి.ఎస్. యాదవ్, బందేల స్వామి, బజరంగ్, ఖుద్దూస్, ఎండి షరీఫ్, ఎండి ఆసిఫ్, చింత యాదయ్య, దేవరకొండ యాదగిరి, కొండస్వామి, తరకొప్పుల శంకర్, ఎండి జుబేర్, బోగారి రామకృష్ణ, అబ్దుల్ రహీం, దేవరాపల్లి మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుడి విజయం... ఉప్పొంగిన మనసు... గర్వంతో నిండిన హృదయం!??

స్నేహితుడి ప్రతి విజయం... మా ఆనందానికి కొత్త చిరునామా.
నీ విజయం చూస్తే... మా మనసు ఆనందంతో ఉప్పొంగిపోతుంది.



స్నేహం అంటే ఇదే... నీ గెలుపే మా సంబరం.
స్నేహితుడి విజయమే... మా ముఖంపై చిరునవ్వు, నా హృదయంలో గర్వం.
నీ కష్టం ఫలించింది... నీ విజయం మమ్మల్ని ఆనందంలో ముంచెత్తింది.
స్నేహితుడి విజయం అంటే... మనసంతా సంతోషమే! ??
నీ విజయం మరెన్నో విజయాలకు నాంది కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.
వేముల వీరేశం గారి మిత్ర బృందం

## ఈరోజు గౌ.శ్రీ. వేముల వీరేశం గారు





ప్రభుత్వ విప్,శాసనసభ్యులు నకిరేకల్.
హైదరాబాద్ లో అసెంబ్లీ ఆవరణలోని తన నూతన ఛాంబర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియజేసిన చిట్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీ లక్ష్మీ సైదులు యాదవ్ గారులి ????

# జయన్న 15 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ కోసం మీరు చేసిన సేవ అమోఘం...

## రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి ఽ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క గారు..

తేది : జులై 05 వ తారీకు అనగా ఆదివారం నిన్నటి రోజున ములుగు జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ గారి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి ఽ మంచినీటి సరఫరా,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు గౌరవనీయులు శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క గారు హాజరై సుధీర్ఘకాలం నుండీ సుమారుగా 15 సంవత్సరాలు మంగపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా పనిచేసిన సోదరుడు మైల జయరామ్ రెడ్డి గారిని శాలువా తో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా సీతక్క గారు మాట్లాడుతూ.. 2011వ సంవత్సరం లో ఆనాటి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గండ్ర వెంకటరమణ రెడ్డి గారి నాయకత్వం లో మొదటి సారిగా మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా ఏకగ్రీవంగా ఎన్నికైన మైల జయరామ్ రెడ్డి గారు గడ్డు పరిస్థితి లలో అంటే గ్రామ కమిటీ అధ్యక్షులుగా పనిచేయడానికి కూడా ముందుకు రాని సందర్భం నుండి అప్పుడు వున్నా నాయకుల సమన్వయము తో అంచెలంచెలుగా కాంగ్రెస్ పార్టీ నీ మంగపేట మండలం లో బలోపేతానికి తన శాయశక్తులుగా కృషి చేస్తూ అధికారం లో లేకున్నా అధికార పార్టీ ఎన్ని ప్రలోబాలకు గురి చేసిన నమ్మిన కార్యకర్తలను పట్టుకున్న జండా ను ఎన్నడూ విడవని నీకారసైనా కాంగ్రెస్ పార్టీ లీడర్ జయన్న అదేవిధంగా మండలం లో ట్రైబల్ ఽ నాన్ ట్రైబల్ ఇష్యు నడుస్తున్న కూడా ఏనాడూ కూడా కాంగ్రెస్ పార్టీ మైనస్ అవ్వకుండా ప్రజలకు అందుబాటులో వుంటూ ఈ మధ్యన ఆరోగ్యం సహకరించకపోయినా కూడా నిత్యం జనం కోసం పనిచేస్తు మండల ప్రజలకు పెద్దన్న పాత్ర పోసించారు ఇన్నేండ్లు పార్టీ నీ బలోపేతం చేస్తూ నడిపించిన రథ సారథి కి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి ఇప్పుడే ఎం అవ్వలేదు మీ సేవలను ఇంకా ఎక్కువ గా కాంగ్రెస్ పార్టీ సమూచిత స్థానం కల్పించి స్టేజ్ మీద కూర్చోబెట్టి మిమ్మల్ని ఒక ఆడబిడ్డ గా గౌరవించడం నా బాధ్యత అని గుర్తు చేస్తూ అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్క కార్యకర్తను నాయకునికి తగిన గుర్తింపు కచ్చితంగా ఉంటుంది అని తెలియజేసారు ఈ సందర్బంగా జయరామ్ రెడ్డి మాట్లాడుతూ..





ఇంతకాలం గా నాకు అవకాశం కల్పించిన మన ఆడబిడ్డ మంత్రి సీతక్క గారికి, మాజీ ఎమ్మెల్యే పోదెం వీరన్న గారికి, మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గండ్ర వెంకటరమణ రెడ్డి గారు, నాయిని రాజేందర్ రెడ్డి గారు, నల్లెల కుమారన్న గారు, ప్రస్తుత యంగ్ ఽ డైనమిక్ లీడర్ యువ నాయకుడు పైడకుల అశోకన్న ల నాయకత్వం లో మండల అధ్యక్షులు గా పని చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ నాకు అన్ని సందర్భలలో నాకు సహకరించిన నా శ్రేయోభిలాషి లకు, నా కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు పేరు పేరున పాదాభివందనం తెలుపుతూ నూతనంగా ఎన్నిక కాబడిన మన సోదరులు దళిత బిడ్డ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు గారికి శుభాకాంక్షలు తెలుపుతూ వారికీ కూడా ప్రతి ఒక్కరూ తోడుశీటు సహకరించగలరు అని కోరుతున్న అని తెలిపారు ఈ కార్యక్రమం లో.. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోకన్న, జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి, మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న లతో పాటుగా జిల్లా, నియోజకవర్గం, బ్లాక్ కాంగ్రెస్, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు..



రోజు రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారిని గౌరవనీయులు ఎమ్మెల్యే వీరేశం అన్నగారు ఆఫీసు ఓపెనింగ్ సందర్భంగా ఈరోజు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారిని వేముల వీరేశం అన్న గారిని అంతటి నరసింహా గౌడ్ గారు కలవడం జరిగింది.




# బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలే సామాజిక సమానత్వానికి మార్గదర్శకం: కాంగ్రెస్ నేతలు

**నల్లగొండ, జూలై 6 ( అన్వేషనేత్రం ప్రతినిధి ):**



సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య పేర్కొన్నారు. భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళిత––బహుజనుల సంక్షేమం కోసం బాబు జగ్జీవన్ రామ్ అవిశ్రాంతంగా కృషి చేసి, దేశ ఉప ప్రధానిగా విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య సమరంలోనూ, సామాజిక సమానత్వ సాధనలోనూ ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల ఆశయాల సాధన దిశగా తెలంగాణ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ శంకర్, మామిడి కార్తీక్, పెరిక వినాయక్ రాజ్, పెరిక అంజయ్య, పెరిక చిట్టి తదితరులు పాల్గొన్నారు.





**నకిరేకల్ :-**

భారత మాజీ ఉప ప్రధాని, గౌరవనీయులు బాబు జగ్జీవన్ రామ్ గారి 40 వ వర్ధంతి సందర్భంగా వీ౯ాా నాయకులు మాచర్ల సైదులు మాదిగ గారి ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనమైన నివాళ్లు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంబయ్య గారు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు లింగాల వెంకన్న, సిపిఎంపార్టీ నాయకులు ఏర్పులతాజేశ్వర్, బీఎస్పీ నాయకులు చెడిపల్లి కాశిరాం, కాంగ్రెస్ నాయకులు చెట్టిపల్లి భాస్కర్,వీజుఖీ నాయకులు వంటల రామలింగం, కాటేపల్లి శ్రీరాములు, దుర్గం సైదులు గార్లు తదితరులు పాల్గొన్నారు...



మీ
మాచర్ల సైదులు మాదిగ
వీ౯ాా జాతీయ నాయకులు



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

# ఆట



# 36 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన ఉనై సైమన్



ఫిఫా ప్రపంచ కప్ 2026 లో స్పెయిన్ జట్టు తన విజయ పరంపరను కొనసాగిస్తూ ఘనంగా ప్రీక్వార్టర్స్‌కు చేరుకుంది. టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన రౌండ్-32 పోరులో స్పెయిన్ ఏకపక్షంగా ఆస్ట్రియాను 3-0 తేడాతో చిత్తు చేసింది. మ్యాచ్‌లో స్పెయిన్ స్టార్ ప్లేయర్ మైకెల్ 36వ, 89వ నిమిషాల్లో రెండు అద్భుతమైన గోల్స్ సాధించగా, పెడ్రో పోర్రో 66వ నిమిషంలో మరో గోల్ కొట్టి జట్టుకు భారీ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో పాటు స్పెయిన్ గోల్ కీపర్ ఉనై సైమన్ ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అరుదైన ఘనతను సొంతం చేసుకుని, 36 ఏళ్లనాటి సుదీర్ఘ రికార్డును బద్దలు కొట్టాడు. ప్రపంచకప్ బరిలో ప్రత్యర్థులకు సింహస్వప్నంగా మారిన ఉనై సైమన్, ఏకంగా 519 నిమిషాల పాటు ప్రత్యర్థులను ఒక్క గోల్ కూడా చేయనీయకుండా అడ్డుకుని సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. దీనితో 1990 వరల్డ్ కప్‌లో ఇటలీ లెజెండరీ ప్లేయర్ వాల్టెర్ జెంగా నెలకొల్పిన 517 నిమిషాల నాటి క్లీన్-షీట్ ఘనతను సైమన్ అధిగమించాడు.గత ప్రపంచ కప్ నుంచి ఈ స్పెయిన్ గోల్ కీపర్ అద్భుత ఆటతీరుకు తిరుగులేకుండా పోయింది. చివరిగా 2022 ప్రపంచ కప్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో జపాన్ జట్టు స్పెయిన్‌పై 51వ నిమిషంలో గోల్ చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు జరిగిన ఏ మ్యాచ్‌లోనూ స్పెయిన్ నెట్‌లోకి బంతిని పంపడం ప్రత్యర్థులకు సాధ్యం కాలేదు.ఈసారి లీగ్ స్టేజ్‌లో ఆడిన మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో గ్రూప్ ఎ లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్న స్పెయిన్.. ఇప్పుడు నాకౌట్ మ్యాచ్‌లోనూ ఆస్ట్రియాను గోల్ కొట్టనీయకుండా ఉనై సైమన్ అడ్డుకోవడంతో అప్రతిహతంగా దూసుకుపోతోంది. ప్రీక్వార్టర్స్‌లో (రౌండ్-ఆఫ్-16) స్పెయిన్ జట్టు తదుపరి పోరులో క్రిస్టియానో రొనాల్డో నాయకత్వంలోని బలమైన పోర్చుగల్ జట్టుతో తలపడనుంది. ఫిఫా వరల్డ్ కప్ 2026 నాకౌట్ పోరులో అభిమానులను ఉత్కంఠకు గురిచేసే హై-డ్రామా మ్యాచ్ చోటుచేసుకుంది. స్టార్ స్ట్రైకర్ క్రిస్టియానో రొనాల్డో, యువ సంచలనం గొంకాలో రామోస్ అద్భుత గోల్స్‌తో పోర్చుగల్ జట్టు 2-1 తేడాతో బలమైన క్రొయేషియాను మట్టికరిపించింది. హోరాహోరీగా సాగిన ఈ రౌండ్-ఆఫ్-32 పోరులో విజయం సాధించడం ద్వారా పోర్చుగల్ ప్రిక్వార్టర్స్ (రౌండ్-ఆఫ్-16) కు దూసుకెళ్లింది.

# రెండో టి20 కోసం భారత జట్టులో మార్పులు!!

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో టి20 శనివారం జరగనుంది. మాంచెస్టర్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. తొలి టి20 వర్షం కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. దాంతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో తొలి పోరు వృధా అయ్యింది. ఐర్లాండ్ చేతిలో టి20 సిరీస్ ఓటమి తర్వాత భారత్ ప్రదర్శనపై చాలా మందిలో అనుమానాలు రేకెత్తాయి. ముఖ్యంగా భారత బ్యాటింగ్ విషయంలో చాలా ప్రశ్నలే మొదలయ్యాయి. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత జట్టు బ్యాటింగ్ ప్రదర్శన ఘోరంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా ఐర్లాండ్ చేతిలో వైట్ వాష్ అయ్యింది. ఇక ఐర్లాండ్ కంటే బలమైన ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ కావడం.. టీమిండియా ఫామ్ బాగాలేకపోవడంతో ఈ సిరీస్‌లో భారత ప్రదర్శన ఎలా ఉంటుందనే దానిపై అభిమనుల్లో ఉత్కంఠ నెలకొని ఉంది.ఇక రద్దు అయిన తొలి టి20లో భారత బ్యాటింగ్ ఫర్వాలేదనిపించింది. అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్‌లు అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. శివమ్ దూబే మెరుపులు మెరిపించాడు. అయితే సంజూ సామ్సన్ మరోసారి విఫలం అయ్యాడు. కేవలం పరుగుల మాత్రమే చేశాడు. అది కూడా 7 బంతులు ఎదుర్కొని. ఈ క్రమంలో రెండో టి20 కోసం భారత జట్టులో మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు మార్పులు జరిగే ఛాన్స్ ఉంది. రవి బిష్ణోయ్ స్థానంలో ప్రిన్స్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఐర్లాండ్‌తో జరిగిన రెండో టి20లో ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లు తీశాడు. అయితే అనూహ్యంగా అతడిని ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టి20 నుంచి పక్కన పెట్టారు. అయితే రెండో టి20లో అతడు బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. ఇక చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీని తుది జట్టులో తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. వరుసగా విఫలం అవుతున్న సంజూ సామ్సన్‌ను పక్కన పెట్టే అవకాశాలు ఉన్నాయి. గత మూడు మ్యాచ్‌ల్లో కలిపి 10 పరుగులు కూడా చేయలేకపోయాడు. దాంతో సంజూను పక్కన పెట్టాలని.. వైభవ్‌కు అవకాశం ఇవ్వాలనే ఒత్తిడి టీమిండియా మేనేజ్‌మెంట్ మీద ఎక్కువ అవుతుంది. ఈ ఏడాది జరిగిన టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు ఛాంపియన్‌గా నిలవడానికి ముఖ్య కారణం అయిన సంజూ సామ్సన్‌ను రెండు మ్యాచ్‌ల్లో విఫలం అయినంత మాత్రాన పక్కన పెట్టడం మంచి ఆలోచన

# టీ20తో గ్లోబల్ స్పోర్ట్స్‌గా క్రికెట్

ఇంటర్నేషనల్ క్రికెట్ యొక్క దీర్ఘకాలిక భవిష్యత్తుపై భారత స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి కేవలం టీ20 ఫార్మాట్ మాత్రమే అత్యంత అనుకూలమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. తక్కువ సమయంలో ముగిసే మ్యాచ్‌లను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడతారని, క్రికెట్‌ను ఒక గ్లోబల్ స్పోర్ట్స్‌గా మార్చాలనే ఐసీసీ ఆశయాలకు ఈ ఫార్మాట్ ఎంతో కీలకమని అశ్విన్ పేర్కొన్నారు. క్రికెట్ చరిత్రలోనే ఒక కీలకమైన మలుపు తిరుగుతున్న తరుణంలో అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు 128 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మళ్లీ రీ-ఎంట్రీ ఇవ్వబోతోంది. చివరిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రమే క్రికెట్ పోటీలు జరిగాయి. వీటికి సంబంధించిన అర్హత ప్రమాణాలను కూడా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఇటీవల అధికారికంగా ప్రకటించింది.వార్తా సంస్థ పీటీఐ నివేదిక ప్రకారం అశ్విన్ మాట్లాడుతూ.. "మరో రెండు సంవత్సరాలలో ఒలింపిక్స్ జరగబోతోంది. క్రికెట్‌ను ప్రపంచ స్థాయి క్రీడగా మార్చడంలో ఐసీసీ నిజంగానే సీరియస్‌గా ఉంటే, ప్రస్తుతం నడుస్తున్న వివిధ టీ20 లీగ్‌లలోని జట్లు ఈ విస్తరణలో చాలా కీలక పాత్ర పోషిస్తాయి" అని అన్నారు. అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ లో 'సాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్' జట్టు తరఫున ఆడుతున్న అశ్విన్, ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీ టీ20 లీగ్‌ల వేగవంతమైన వృద్ధి మరియు ఒలింపిక్స్‌లో క్రికెట్ చేరడం వల్ల ఈ క్రీడకు ఆటగాళ్ళ మరియు అభిమానుల సంఖ్య విపరీతంగా పెరుగుతుందని విశ్వసిస్తున్నారు.




RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక



# సినిమా
CINEMA



# నాగబంధం గ్రాఫిక్స్ హైలెట్

సినిమా నిర్మాణ దశ నుంచే తెలుగు ఆడియెన్స్‌లో ఎంతో ఆసక్తిని రేకెత్తించిన చిత్రం నాగబంధం. భారీ గ్రాఫిక్ హంగులతో విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. డివైన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించగా, అభిషేక్ నామా దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో ఈ సినిమా శుక్రవారం విడుదలై ప్రేక్షకులను మెప్పించింది. అనాథ అయిన రుద్ర (విరాట్ కర్ణ)ను పద్మమ్మ (శరణ్య) చేరదీసి సొంత కొడుకులా పెంచుతుంది. తన చెల్లెలి (సోనియా సింగ్) పెళ్లిని రాజు అనే యువకుడితో ఘనంగా చేయాలని రుద్ర అనుకుంటాడు. సరిగ్గా పెళ్లి సమయంలో రంగనాథ స్వామి ఆలయంలోని బ్రహ్మకమలం కోసం రుద్ర కుటుంబంపై జుల్ఫికర్ అలీ (రిషబ్) దాడి చేస్తాడు.




# మా ఇంటి బంగారం ఓ మంచి సినిమా

అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ సినిమా జులై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు అఖిల్. ఇక చిత్ర ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ తాజా ఇంటర్వ్యూలో ఆయన టాలీవుడ్ రీసెంట్ ఇండస్ట్రీ హిట్ 'మా ఇంటి బంగారం' సినిమా గురించి అందులో సమంత నటన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'లెనిన్' ప్రమోషన్స్ బిజీ వల్ల తాను ఇంకా 'మా ఇంటి బంగారం' సినిమా చూడలేదని, కానీ ఆ చిత్ర ట్రైలర్ చూశానని అఖిల్ వెల్లడించారు. ట్రైలర్ వైబ్ అద్భుతంగా ఉందని, చూసినప్పుడే ఇది కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని తనకు అనిపించిందని చెప్పారు. ఒక మంచి ఇంటికి కోడలిగా వెళ్లి, ఆ కుటుంబ సభ్యులందరితో బంగారం అనిపించుకోవాలనే చక్కటి ఫ్యామిలీ ఎలిమెంట్‌కు పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడించి సినిమాను చాలా కొత్త కాన్సెప్ట్‌తో, సహజంగా తెరకెక్కించారని ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా ఒక మహిళా ప్రధాన పాత్రతో ఆ స్థాయి యాక్షన్ సీన్స్ చేయించడం నిజంగా అద్భుతమని కొనియాడారు. ఈ చిత్రంలో సమంత పాత్రను అద్భుతంగా పండించిందని మెచ్చుకుంటూ, కంగ్రాట్స్ సామ్ అంటూ సమంతతో పాటు 'మా ఇంటి బంగారం' చిత్రబృందానికి అఖిల్ తన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విడాకుల తర్వాత కూడా అక్కినేని కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా అఖిల్‌తో సమంతకు ఉన్న ఈ రిలేషన్ పరస్పర గౌరవం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



# ఆసక్తికరంగా సాగిన రావు బహదూర్

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు వెంకటేశ్ మహా. ఇప్పుడాయన సత్యదేవ్‌తో కలిసి చేసిన ప్రయోగాత్మక చిత్రం 'రావు బహదూర్'. దీనికి మహేశ్‌బాబు స్వయంగా సమర్పకుడిగా వ్యవహరించడం.. ఇందులో సత్యదేవ్ భిన్న గెటప్పుల్లో కనిపించనుండటం.. టీజర్, ట్రైలర్లు ఆసక్తిరేకెత్తించేలా ఉండటంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై మంచి అంచనాలేర్పడ్డాయి. 1968 - 1991 మధ్య కాలంలో సాగే కథ ఇది. రామప్ప రావు బహదూర్ (సత్యదేవ్) ఓ రాజవంశీకుడు. కాలేయ క్యాన్సర్‌తో పోరాడుతూ జీవిత చరమాంకంలో ఉంటాడు. అతను కొన్ని నెలలకు మించి బతకడని డాక్టర్లు చెప్పినప్పటికీ.. వాళ్ల అంచనాల్ని తలకిందులు చేస్తూ నిక్షేపంగా జీవిస్తుంటాడు. అయితే, తీవ్రమైన మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటాడు. ముఖ్యంగా అతన్ని ఓ అనుమానం పెనుభూతంలా పట్టిపీడిస్తుంటుంది. దాన్ని తీరిస్తే చాలు.. సంతోషంగా ప్రాణం వదిలేస్తానని తన మిత్రుడు, వ్యక్తిగత వైద్యుడు ఆచారి (వికాస్ ముప్పాల) దగ్గర మాట తీసుకుంటాడు. మరి అతనికున్న ఆ అనుమానమేంటి? దానివల్ల అతని చుట్టూ ఉన్న వాళ్లని ఎన్ని రకాలుగా ముప్పుతిప్పలు పెట్టాడు? అసలు రామప్ప గతమేంటి? రేణుక (దీపా థామస్)తో ప్రేమ, పెళ్లి ప్రయాణం ఎలా సాగింది? ఆమెకి దూరంగా రామప్ప ఒంటరిగా జీవించడానికి వెనకున్న కారణమేంటి? అన్నది సినిమా కథ. ఇదొక విభిన్నమైన సైకలాజికల్ డ్రామా. జీవిత చరమాంకంలో ఉన్న ఓ రాజవంశీకుడు తనకున్న అనుమానం అనే జబ్బుతో చుట్టూ ఉన్న వాళ్లని సైకలాజికల్‌గా ఆడుకుంటూ తన కోరికని ఎలా నెరవేర్చుకున్నాడన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. పైకిది ఓ రాజవంశ కథలా కనిపించినా.. అంతర్లీనంగా సమాజంలో తరతరాలుగా గూడుకట్టుకుపోయిన వివక్షాపూరిత వ్యక్తిత్వాల గురించి చర్చిస్తుంది. ప్రధానంగా కుల వ్యవస్థ, రంగు, రక్తసంబంధాలు, వారసత్వ హోదాపై ఉన్న పిచ్చిని ఈ చిత్రం బలంగా ప్రశ్నిస్తుంది. కానీ, ఈ సినిమాతో దర్శకుడు వెంకటేశ్ మహా చెప్పాలనుకున్న విషయం ఆలోచన రేకెత్తించేదే అయినా.. దాన్ని ఆద్యంతం జనరంజకంగా మలచడంలో అక్కడక్కడా తడబడ్డారు. ఓ ఫొటో ఫ్రేమ్ నుంచి బయటకొచ్చిన పిల్లాడిని ఊడలు తరుము కుంటూ రావడం.. తనని తిరిగి సమాధిలో బంధించడం.. కట్ చేస్తే మంచం పట్టిన స్థితిలో వృద్ధ పాత్రలో హీరోని పరిచయం చేయడం.. ఇలా ఆరంభ సన్నివేశాలు ఏదో కొత్త కథని, కొత్త ప్రపంచాన్ని చూడబోతున్నామన్న ఆసక్తిని కలిగించేలా చేస్తాయి.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434